# చిట్టెమ్మ కాసే చేపల పులుసు

ఆ లక్ష్మివారం సంతలో పులసచేపల గంపల దగ్గరే ఎక్కువ జనమున్నారు. వాళ్ళందర్నీ తోసుకుంటూ లోపలికెళ్ళిపోయిన చింతానారయ్య బోల్డు రేటెట్టి మూరడు చేపని కొనుక్కొచ్చి ''కొంచెం పులుసు గాసివ్వవా'' అని చిట్టెమ్మ చేతికిచ్చేడు.

ఆ చేపని తిరగేసి మరగేసి చూసిన చిట్టెమ్మ ''పోతు పులస తెచ్చేరేంటండోయ్..ఇదంటే మీకిష్టవా?'' అనడిగింది.

అర్థంగాని నారయ్య ''పోతుపులసేంటి... ఇందులో రకాలుంటయ్యేంటి?'' అన్నాడు.

నవ్వుతా వాకిట్లో మొక్కలిపీట మీద కూర్చుని ఆ చేపనే చూస్తా ''అవునండి ...మనుషుల్లో ఆడామగాలాగా పులసల్లో కూడా పోతుపులసనీ ఆడపులసనీ రెండు రకాలుంటాయి ఆడపులసనే శనపులస అనికూడా అంటారండీ... ఆయ్'' అంది.

''అయితే ఈ రెండింట్లో ఏది రుసిగా ఉంటదంటావ్ చిట్టెమ్మా?'' అడిగేడు నారయ్య.

నవ్వేసిన చిట్టెమ్మ ''రెండిటియ్యీ రెండు రకాల రుచులండి..కడకి రెండూ బానే వుంటాయను కోండి, ఈ పాలికిది రుసి చూసి చెప్పండి వచ్చేవారం శనపులస కొనుక్కొస్తే పులుసు గాసిస్తాను అప్పుడు మీకే తెలుత్తుది తేడా'' అంది.

''అలాగలాగే పులుసుకోసం ఎంతసేపట్లో పంపమంటావ్ మా ఆడోళ్ళని?''

''వండిన వెంటనే తింటే బాగుండదండి. ఈ వేళ్టికొద్దుగానీ రేపు చల్దిపొద్దేళప్పుడు పంపండి మణిషిని అప్పటిదాకా ఉడికిన పులుసు ఆ మట్టిదాకలోనే చల్లారి ఉంటదేమో రుచి బాగా పెరుగుద్ది''అనేసి చిట్టెమ్మనే సరికి మారుమాట మాటాడకండా వెళ్ళిపోయేడు చింతా నారయ్య.

బట్టీ పనిమీద బయటికెళ్తున్న మొగుడు నారాయుడ్నాపి కొంచెం ఈ చేప పొలుసు తీసి పెట్టమంది. ఆ పని జేసి అర్జంటుగా

వెళ్ళిపోయేడు నారాయుడు ఆ తర్వాత ఆ చేపని గరుకు రాయి మీదేసి బాగా తోమి వాసన పోయేలాగ శనగపిండేసి బాగా రుద్ది కడిగేకా చాకుతో బుర్ర పైన మూతికి మూడంగుళాల దూరంలో గాటు పెట్టి కొద్దిగా కోసి పెకిలిస్తే ముందు చేదుకట్టు వచ్చింది. ఇంకా పేగులయ్యీ తీసేసేక శుభ్రం చేసి ముక్కలు కింద కోసి ఓ పక్క నెట్టింది.

ఉల్లిపాయువముక్కలూ, వెల్లుల్లి పాయరేకలూ, అల్లం జీలకర్రా, ధనియాలూ కలిపి ముద్ద కింద నూరి ఒక సీవండి గిన్నెలో వేసింది. గుప్పెడు పొడుగాటి మిరపపళ్లని తీసుకొచ్చి రోట్లోవేసి ముతగ్గా దంచి ఇంకో చిన్న గిన్నెలో వేసేక లోపలికెళ్ళి చాలా వెడల్పాటి మట్టిదాక బయటికి తెచ్చింది. చూడ్డానికి బాగా వెడల్పుగా లోతు చాలా తక్కువగా ఉన్న అలాంటిదాకని ఎక్కడా చూసెరగం మనం. ఈ పులుసు గాయడానికి పని గుట్టుకుని కుమ్మరికోటయ్య ఇంటికెళ్ళి చేయించుకుని ఆవలో కాల్పించి తెచ్చుకుంది చిట్టెమ్మ.

ఆ దాకని మండుతున్న చింతపుల్లల పొయ్యిమీద పెట్టి రవణ నువ్వులగానుగలోంచి తెచ్చిన నువ్వుల నూని అందులో వేసి సెగొచ్చేదాకా కాగేక నూరిన ముద్దలన్నీ ఒకదాని తర్వాత ఒకటేసి



చెక్క గరిటితో దోరగా వేయించేక అంతసేపు లేత కొబ్బరినీళ్ళలో నానేసిన పాత చింతపండుని పులుసుగా పిసికి దాక సగానికి పైగా నిండేలాగ వేసింది. టమోటాపళ్ళు కసకసామంటా పిసికేసి జల్లేసింది. చిటికెనవేలు సైజులో కోసిన లేత బెండకాయముక్కలేసి ఆ తర్వాత ఒకో చేప ముక్కా పులుసులో మునిగేలాగ వేస్తా వచ్చింది. అలాగ అన్నీ వేసేసేక దాకకి సరిపడా చేయించిన జల్లిమూకుడు తెచ్చి పైనబెట్టి పొయ్యిలో మండుతున్న చింతపుల్ల లెగదోసింది.

పావుగంట దాటింది.

కుతకుతా ఉడుకుతా బుళుకు బళుకు మనే బుడగల్తో చప్పుళ్ళు చేస్తుంది దాకలో పులుసు. కమ్మటి పులుసువాసన నోరూరించే వాసన. అలాగ కాసేపు ఉడకనిచ్చి ఆ తర్వాత పొయ్యిలో మండుతున్న చింతపేడుల్ని వెనక్కి లాగేసి నీళ్ళు చల్లేసరికి సుయ్యిమంటా ఆరిపోయి నియ్యా పుల్లలు.

ఇప్పుడు లోపలున్న చింతనిప్పుల్తో సన్నని సెగమీద మరుగుతుంది పులుసు. ఇలా మరగడం వల్ల చేపముక్కలో సన్నటిముళ్ళన్నీ కరిగిపోతాయంట. అలా కరిగి మరిగి మరిగి కాసేపటికి చక్కటి రుచి వచ్చేలాగ చిక్కబడింది పులుసు. ఇంకాస్సేపయ్యేక దాక కిందకి దింపేసి వెన్నపూస ముద్ద ఆ పులుసులో వేసి పొయ్యార్పేసింది. మొత్తం వేడంతా పోయి చల్లారేక సీవండి రేకులో ఉంచుకున్న ఆవకాయ తేట ఆ పులుసులో కలిపేసి ''తెల్లారేక తీద్దారిలే'' అనుకుంటా భోషాణం పెట్టిలో పెట్టేసింది.

మర్నాడు పొద్దుటే చింతా నారయ్య మనిషొస్తే ఆ పులుసు మొత్తం ఇంకో పెద్ద గిన్నెలో వేసిచ్చింది.

అన్నంలో ఆ పులుసేసుకు ఒక ముద్ద నోట్లో పెట్టుకున్న నారయ్య ఇంట్లో జనం ''అమ్మో ఎంత రుసీ'' అనేసి ఎగిరి గంతులేస్తా.. ''మేం గాస్తే ఎందుకింత రుసి రావట్లేదూ...'' అని ఒకటే గొడవ. పులుసు కలుపుకు తిన్నోళ్ళెవరికి ఎన్నిసార్లు కడుక్కున్నా చేతికున్న నీచు వాసన పోదు. మరి చిట్టెమ్మ ఆ చేపల పులుసులో ఏం కలుపుద్దోగానీ తినేసి చెయ్యి కడుక్కున్నాకా వాసనే రాదు. ఎందుకని అడిగితే ''రగస్సెం'' అని నవ్వేస్తది.



కోటిపల్లి వెళ్ళి రెండుమూరల పొడుగున్న చేపని కొనుక్కొచ్చిన చింతా బ్రాహ్మణరెడ్డి గారు సరాసరి చిట్టెమ్మ దగ్గర కొచ్చి ''కొంచెం పులుసుగాసిద్దూ'' అన్నారు.

''ఎక్కడ కొన్నారండి రెడ్డిగారూ'' చేప శంఖు చూస్తా అడిగింది చిట్టెమ్మ.

చెప్పేరు బ్రాహ్మణరెడ్డిగారు.

''చేపని మీరు దవిళేశ్వరంలో కొంటే బాగుండేదండయ్యా'' అంది చిట్టెమ్మ.

''ఎందుకూ... అది మీ పుట్టినూరనా?'' నవ్వుతా అడిగేరు బ్రాహ్మణరెడ్డిగారు.

నవ్వేసిన చిట్టెమ్మ ''కాదండి...అదేదో దేశం సముద్రంలో పుట్టి వర్షాకాలమప్పుడు వేల మైళ్ళు ఈదుకుంటా మన కాకినాడ సముద్రంలో కొచ్చే పులసచేప యానం గోదాట్లోకి మళ్ళి ఎర్రటి వరద నీరు తాగి ఎదురీదుతా కోటిపల్లి రేవులో కొచ్చేసరికి దాన్ని పట్టేసు కుంటున్నారు'' అంది.

''పట్టుకోక ఏం జెయ్యాలంట?'' అడిగేడు బ్రాహ్మణరెడ్డిగారు.

''ఆ చేప ఎర్రటి వరదనీరు ఎంత తాగితే అంతరుచి. అలాగ ఆ ఎర్రనీరు తాగుతా ఎదురీదతా రావులపాలెం, దవిళేశ్వరం దాకా వచ్చేక దొరికే చేపని వండించుకు తినండి... ఆ రుచే వేరండి'' అంది చిట్టెమ్మ.

మర్నాడు దవిళేశ్వరం వెళ్ళి చేప కొనుక్కొచ్చి ఆ పులుసు కాయించుకుతిన్న బ్రాహ్మణ రెడ్డిగారు ''నువ్వన్నది నిజం చిట్టెమ్మా'' అనేసి ఒప్పేసుకుని ''ఔనూ... ఇంత మహత్తరంగా పులుసుకాయడం ఎక్కడ నేర్చుకున్నావ్?'' అనడిగితే నవ్వేసి ''నా పులుసేం పులుసండీ మా దవిళేశ్వరంలో నన్ను మించి కాసే ముసలోళ్ళున్నారండి'' అనేసి పాకలోపలి కెళ్ళిపోయింది.

గోదాట్లో పులసలు దొరికే వర్షాకాలం వస్తే చిట్టెమ్మ ఊపిరి సలపనివ్వరు వూరి జనం. మహా మహా మేడల్లోనూ మిద్దెల్లోనూ ఉండే పెద్ద పెద్దోళ్ళంతా కూడా చేపట్టుకు చిట్టెమ్మ పెంకు టింటి ముందు నిలబడి పులుసు కాసిమ్మని అడగాల్సిందే. మా వూరోళ్ళు బయటూరెళ్తే ''అవునూ..మీ వూళ్ళో చిట్టెమ్మనే మనిషి పులసచేపల పులుసు మా గొప్పగా కాస్తదట. ఆ పులుసు తిని చెయ్యి కడుక్కున్నాకా చచ్చిపోయినా పర్లేదట నిజవా?'' అనడుగుతారు జనం.

* * *

చిట్టెమ్మ పెనిమిటిపేరు వాసంశెట్టినారాయుడు. నిన్న మొన్నటిదాకా పులగుర్త రేవు అవతల రామకోట దగ్గర గొట్టం ఇటుకల బట్టీలో మేస్త్రి పని చేసిన నారాయుడు ''ఇలాగ ఎంతకాలం మనం కూడా సొంతంగా వ్యాపారం జేసుకుందాం'' అని అద్దికి ఒక ఎకరం జాగా దొరుకుద్దేమో అని చూస్తున్నాడు.

పసలపూడి స్మశానాలు దాటుకుంటా ముందుకెళ్ళేక అలా వెదురుపాక రూట్లో వెళ్ళకండా ఎడం పక్కకి తిరిగితే వచ్చే సర్వాయతోట దగ్గర అద్దెకివ్వడానికి ఒక ఎకరం నేల ఉంది. అది నరాల రాంబాబు మెరకపొలం. అక్కడ బోరింగు షెడ్డుకూడా ఉంది. అందులోనే పెళ్ళాం పోయిన రాంబాబు మకాం. ''అయితే మరి గొట్టం బట్టీ కట్టుకుని నీ పొలంలో మట్టే తవ్వుకుని ఇటుక తీసుకుంటాను. నీళ్ళకి నీ బోరింగే వాడుకుంటాను ఏడాదికెంత?'' అనడిగేడు నారాయుడు.

ఇంత అన్జెప్పిన రాంబాబు ''నాకు కొంచెం అప్పులున్నాయ్యి ఏడాది అద్దీ ముందు కడితేనే ఇస్తాను. అంతేగాదు నా కాపరం ఈ బోరింగు షెడ్లోనే దాని కొప్పుకుంటేనే'' అని కండీషను పెట్టేడు. ఆడుంటే మనకేంటి నష్టం అనుకుంటా హుషారుగాఇంటికొచ్చిన నారాయుడు

పెళ్ళాం చిట్టెమ్మ మట్టి పట్టిన నెక్లెసూ, వాళ్ళమ్మా వాళ్ళూ పెట్టిన నానుతాడు తీసుకుని రాంపురం మర్వాడీ కొట్లో అమ్మేసి వచ్చిన డబ్బులో కొంత నరాల రాంబాబుకి కట్టేసి మిగతా బేలెన్సుతో రాత్రీ పగలు కష్టపడి గొట్టం బట్టీ కట్టుకుని కూలోళ్ళని పెట్టుకుని బంగారం రంగు వచ్చేలాగ కాలుస్తున్నాడు ఇటుక.

ఆ ఏరియాలో మాచవరం ఇటుక్కి మంచి డిమేండు. ఆ బట్టీల్లో మేస్త్రిగా పని చేసొచ్చి సొంతంగా బెట్టుకున్న నారాయుడి ఇటుక్కికూడా మంచిరేటే పలుకుతుంది.

బట్టీలో పచ్చి ఇటుకేసి మట్టితో బీటలు కనపడకుండా పచ్చిమట్టి దూర్చి మెత్తేసి ఊకతో కాల్చిన ఇరవై నాలుగుగంటల దాకా బట్టీ ముట్టుకోరు. రంగు తేరిన ఇటికని బాగా తెల్లారేక చల్లారేక తీస్తారు బయటికి.

ఆవేళ ఇరవైవేల ఇటుకని బయటికి తీసి గుట్ట పెట్టి చీకటి పడ్డాకా వూళ్ళోకెళ్ళి పొద్దుటే వచ్చిన నారాయుడికి గుట్టలో రెండువేల తక్కువ కనిపించింది.

ఏవయ్యిందా అనుకుంటుండగా బోరింగుషెడ్డులోంచి బయటికొచ్చిన నరాల రాంబాబు గాడు ''... రాత్రి నదురుబాద నించి మంచి బేరమొచ్చింది. ఆ అర్ధరాత్రి పూట వచ్చి నిన్ను లేపి చెప్పడవెందుకులే అని నేనే ఇచ్చేసేను... సరుకు రాత్రే తోలుకుపోయేరు. రొక్కం ఎల్లుండు పట్టుకొస్తానన్నారు'' అన్నాడు.

కొంచెం చిరాకు పడ్డ నారాయుడు ''నన్నడక్కుండా ఈ పనెందుకు జేసేవ్ అసలు అడ్మాంసుకూడా పుచ్చుకోకుండా సరుకెందుకిచ్చేవ్?'' అన్నాడు.

''నదురుబాద కమ్మోరు చాలా గొప్పోరు. ఇదాయికంగా రేపట్టుకొచ్చి ఇచ్చేస్తారు'' అన్నాడు.

చిరాకు పడతానే మట్టి తవ్వి పోతుల్తో కళ్ళంతొక్కించే పన్లో పడ్డాడు. ఈలోగా క్రిష్ణా రైసుమిల్లు దగ్గర్నుంచి ఊకబండి దిగింది.

* * *

వారమయినా పది రోజులైనా ఆ నదురుబాదోళ్ళ దగ్గర్నించి ఇటుక డబ్బులు రాలేదు. ఏంటంటే ''ఇదిగో అదిగో'' అంటున్నాడు రాంబాబు.

కుంటి అమ్మిరెడ్డి కొట్లో అద్ది సైకిలేసుకుని ఆ నదురుబాదెళ్ళి వాకబు జేస్తే తెల్సిందేంటంటే 'కేషిస్తే తప్ప ఇటికివ్వ''నని ఆ రాత్రికి రాత్రే రాంబాబుగాడు రొక్కం లాగేసుకున్నాడట.

ఏంటిదని రాంబాబు నడిగితే ''పాత అప్పులికీ సాదరు ఖర్చులకి అవసరమొచ్చి'' అనేసి, ''ఈ ముక్క బయటెక్కడా అనకు నాకు చాలా నామర్దా''అనేసి గళ్ళరుమాలు ముఖం మీదేసుకు దాటేసేడు.

చాలా చిరాకు పడిపోయి ఇంటికెళ్ళి పోయిన నారాయుడు ఆ రాత్రి కుందయ్యకొట్లో కాస్త తాగి నరాల రాంబాబుగాడి మీద చిరాకు చిట్టెమ్మ మీద చూపించేడు.

అలాగ ఇంకో రెండు మూడు సార్లు జరిగింది. ఆవేళ ఇదేంట్రా అని అడిగిన నారాయుడికి ఏవో స్టోరీలు చెప్తున్నాడు రాంబాబు. ''ఏంట్రా నీ యవ్వారం'' అని ఎదురు తిరిగితే ''బట్టీ పెట్టుకుంటావంటా తాళ్ళపాలెం జనం వస్తున్నారు ఇప్పుడు నా జాగాకి మంచి డిమేండు నీ డబ్బులు నీకిచ్చేస్తాను పట్టుకుపో'' అనేసేడు ఓ రోజు.

చాలా చిరాకు పడిపోయిన వాసంశెట్టి నారాయుడు ఆవేళ చాలా ఎక్కువ తాగేసి ఇంటికెళ్ళి "ఆ నీతిలేని ఎదవ వాలకం జూడు" అంటా నానా అల్లరీ చేసి చివరాఖర్లో చిట్టెమ్మ మీద చెయ్యి జేసుకున్నాడుకూడా.

* * *

రామచంద్రపురం మీంచి అడ్డంగా చేలల్లోంచి పసలపూడి వెదురుపాక, సొవరం అక్కడ్నించి రాయవరం దాకా కొత్త కరెంటు లైను వేస్తున్నారు. అదేదో ప్రైవేటుగా రాయవరం లో కట్టే ఫేక్టరీకోసం వేస్తున్న లైను లాగుంది. అలా వేసుకుంటా పోతున్న ఆ కరెంటు స్తంభాలు నరాల రాంబాబు పొలం మధ్యలోంచి పడినియ్యి. పొద్దోయేకా ఆ స్తంభాలేసే జనం వాళ్ళు, సిమ్మెంటు బస్తాలూ అల్యూమినియం వైర్ల చుట్టలూ నట్లూ బోల్టులూ లాంటి సామానంతా. రాంబాబు బోరింగుషెడ్డులో దాచుకునేవారు. ఇనపస్తంభాలు షెడ్డు వెనక వేసుకునేవారు.

వాళ్ళెళ్ళేక చాలా సీక్రెటుగా ఆ స్తంభాల్లో ఒకటిరెండింటినీ ఆ వైర్ల చుట్టల్లో రెండు మూడు అలాగే నట్లూ బోల్టులూ ఏంగిలర్లూ ఇంకోచోటికి మళ్ళిం చెయ్యడం మొదలెట్టిన రాంబాబు ఆళ్ళెవరికీ ఎలాంటి అనుమానం రాకుండా చాలా కామెడీగా మేనేజ్ చేసేయడం మొదలెట్టేడు.

కరెంటులైను పూర్తయ్యింది. ఆళ్ళంతా వెళ్ళిపోయిన కొన్నాళ్ళకి దాచి పెట్టిన ఆ సామానంతా మండపేటలో ఉన్న ఒక ఇనపకొట్టోళ్ళకి అమ్ముదామని చూసేడు రాంబాబు. కానీ, వీడి వాలకం వేషం మాటాడేతీరూ చూసి అనుమానం వచ్చిన ఆ కొట్టోళ్ళు పోలీసోళ్ళకి కబురంద జేసేరు.

బట్టీ దగ్గరకి వచ్చిన పోలీసులు నరాల రాంబాబుని పట్టుకుని నాలుగు లాగి అడిగితే "నాకేం తెల్దండి ఈ జాగా వాసంశెట్టి నారాయుడుకి అద్దెకిచ్చి చాన్నాళ్ళయ్యిందండి" అని తప్పించుకునే సరికి నారాయుడి మీద పడ్డారు పోలీసులు. వాళ్ళకి అంతా వివరించి చెప్పి ఒప్పించి పంపించేసిన నారాయుడు కడుపు రగులుకుపోయింది. ఆ రాత్రి ఫుల్లుగా తాగేసి పటకా కత్తి పట్టుకెళ్ళి రాంబాబుగాడి పొట్లో పొడిచేసరికి పేగులన్నీ బయటికొచ్చేసినియ్యి.

వాటిని చూసి భయపడిపోయిన నారాయుడు ఆ రాత్రికి రాత్రే పసలపూడి వదిలి పారిపోయేడు.

బట్టీ దగ్గర కాపరాలుంటున్న కూలిజనం రామచంద్రపురంలో గాంధీడాక్టరు గారి హాస్పిటలుకి తీసుకెళ్తే పేగులు బయటికి రావడం తప్ప పొట్టలోపల ఏ డేమేజీ అవ్వక పోడంతో కుట్లేసేరు.

నరాల రాంబాబుగాడు బతికిపోయేడు.

హాస్పిటలునించి బయటికొచ్చిన నరాల రాంబాబు సర్వాయతోటలో జనాన్నందర్నీ పిల్చి వాళ్ళకి స్టోరీ బాగా మార్చి చెప్పేసరికి ఆ వాసంశెట్టి నారాయుడు "మళ్ళీ ఇక్కడికెలాగొస్తాడో చూద్దారి" అంటా పగబట్టేరు వాళ్ళు.

రాంబాబుగాడు బతికిన విషయం తెల్సుకున్న వాసంశెట్టి నారాయుడు అప్పుడప్పుడూ రాత్రుళ్ళు ఇంటికొచ్చి వాడిగొడవ కనుక్కుని ఆ రాత్రంతా పెళ్ళాం చిట్టెమ్మ దగ్గరుండి కాలవ దగ్గర గోపాలరావు కాఫీ హొటేలు తెరవక ముందే ఆ చీకట్లోనే వెళ్ళిపోతున్నాడు.

అలాగ కొన్నాళ్ళ పాటు వచ్చెళ్ళిన వాసంశెట్టి నారాయుడు "ఆ గొడవింక ఇప్పట్లో చల్లారే లాగలేదని చిట్టెమ్మ చెప్పడంతో పద ఇంకెక్కడన్నా బతుకు దెరువు వెతుక్కుందాం" అనేసి కుండలూ మండలూ గోనిసంచుల్లో మూటలు గట్టుకుని ఒకరాత్రికి రాత్రే వెళ్ళిపోయేరు పసలపూడ్నుంచి.

* * *

వర్షాకాలం వచ్చేసింది. నల్లటి మబ్బుల్తో పొగచూరిపోయిన వంటిల్లులాగున్న ఆకాశం జాడించిమరీ కొడ్తుంది వర్షం. ఒకోసారి తెల్లారుఝామునే మొదలెట్టి చల్దిపొద్దేళ దాటినా కురుస్తానే వుంటుంది. ఇంకోసారి దీపాలవేళయినా ఆగకుండా కురుస్తుంది. అక్కడెక్కడో గోదారి పుట్టిన చోట ఒకటే వరదలంట ఆ నీరు ఎర్రగా పొంగుతా వస్తుందీ పక్కకి. ఇంకేముందీ ఇంక ఆ వరద నీటికి జోరు జోరుగా రావడం మొదలెట్టేసి నియ్యి పులసచేపలు.

''అవునూ చిట్టెమ్మ మొగుడు నారాయుడికీ సర్వాయతోటలో రాంబాబుగాడికీ గొడవలయినియ్యి అన్నారు ఆ మధ్య... చివరికి ఏవయ్యిందీ?'' ఆ వర్షం కురుస్తున్న మధ్యాన్నం వాళ్ళ మేడ ముందు జేరిన రామంగార్ని అడిగేరు బ్రాహ్మణరెడ్డిగారు.

జరిగిందంతా దారంలో రంగు పూసలు గుచ్చినట్టు వివరంగా చెప్పేడు స్వరాజ్యరెడ్డి గారు.

మొత్తమంతా విన్న బ్రాహ్మణరెడ్డిగారూ కర్రిరాముగారూ ''ఏదో కొట్టుకు చచ్చేర్లే పాటకపు ఎదవలు అనుకున్నాం... ఇదా జరిగిందీ...ఇందులో చిట్టెమ్మ మొగుడు తప్పేంలేదే పాపం ...'' అన్నారు.

''అవును...తప్పంతా ఆ ఎదవ తత్తుకొడుకు రాంబాబుగాడిదే'' అన్నాడు విశ్వనాధంగారు.

''ఆ చిట్టెమ్మోళ్ళు ఇప్పుడెక్కడ ఉంటున్నారో వాకబు జెయ్యండి'' అన్నారు కర్రెంకయ్యగారు.

''గోకవరం అవతలంట'' చెప్పేడు అప్పుడేవచ్చిన కోనాల చంటిబాబు.

మర్నాడు తెల్లవారుఝామునే రెండు జీపులూ ఒక చిన్నకారూ డి.టి.14 ట్రాక్టరు వేసుకుని బయల్దేరేరు.

గోకవరం అవతలున్న ఫోక్సుపేట ఠాణా దగ్గర రెండున్నరవేలు పట్టే చిన్న గది (చిన్నబట్టీ) కట్టుకుని చిట్టెమ్మ ఒక పక్కా నారాయుడు ఇంకో పక్కా కూర్చుని నేలమీదే ఇటుక తీత మొదలెట్టేరు.

అంతలో బళ్ళ మీద దిగిన మా వూరోళ్ళందరికీ మట్టి చేతుల్తోనే దణ్ణాలు పెడతా నిలబడ్డారాళ్ళు.

ఆ భార్యాభర్తల్ని ట్రాక్టరెక్కించి పసలపూడి తీసుకొచ్చేసిన మా వూరి పెద్దలు ''నరాల రాంబాబుగాడ్ని రామచంద్రపురం పోలీసుస్టేషన్‌కి తీసుకెళ్ళి నిజం చెప్పించి వీపు బద్దలు గొట్టించేక నీ బట్టీ పని నువ్వు జూసుకో నారాయుడు...నీ వెనకాల మేవంతా ఉన్నాం'' అని మాటిచ్చేరు.

పసలపూడోళ్ళంతా గల్సి ఇంత చెయ్యడానికి వెనకాల చిన్న స్వార్ధం ఉంది. అదేంటంటే ———

చిట్టెమ్మకాసే చేపల పులుసు. ఆ పులుసు వేడి అన్నంలో కలుపుకుని ప్రతిఏడూ తినాలి మేం. ఆ రుచీ ఆ వాసనా మావూరి పొలిమేరలు దాటి పోకూడదు ఎప్పటికీ. చిట్టెమ్మ ఎప్పటికీ మావూళ్ళోనే ఉండాలి.

* * *